సాక్షి
జగిత్యాల
శనివారం : 24 : జూన్ : 2023



గంగమ్మ బోనాలు

సారంగాపూర్ : పోచంపేట గ్రామ గంగమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు.



ఎమ్మార్సీ సందర్శన

మల్యాల : స్థానిక ఎమ్మార్సీని డీఈవో జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి వివిధ అంశాలపై ఆరా తీశారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సనాతన ధర్మ పరిరక్షణకే ఆలయాలు



నృసింహుని ఆలయంలో స్వామీజీ

ధర్మపురి: సనాతన హిందూ ధర్మ పరిరక్షణకే ఆలయాలు వెలిశాయని శృంగేరి శివగంగ పీఠాధిపతి పురుషోత్తమ భారతీస్వామీజీ అన్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి పుణ్యక్షేత్రానికి గురువారం రాత్రి చేరుకున్న స్వామీజీ.. శుక్రవారం తొలుత శ్రీలక్ష్మీనృసింహస్వామి, ఆ తర్వాత అనుబంధ ఆలయాల్లో పూజలు చేశారు. శేషప్ప కళావేదిక పైనుంచి స్వామీజీ మాట్లాడారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటే భక్తుల సకలపాపాలు తొలగిపోతాయన్నారు. మానవజన్మ ఎంతో ముఖ్యమైనదని, దానిని పరమాత్మునికి అర్పించే దిశలో ముందుకు సాగాలని సూచించారు. అంతకుముందు భక్తులు, అధికారులు స్వామీజీకి ఘనస్వాగతం పలికారు. పాదాభివందనం చేశారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఈవో శ్రీనివాస్, రేనోవేషన్ కమిటీ చైర్మన్ ఇందారపు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

28న జాబ్‌మేళా

జగిత్యాల: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీ ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈనెల 28న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి నారాయణ శుక్రవారం తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఇంటర్ బైపీసీ, ఎంపీసీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారిని కంపెనీ సొంత నిధులు వెచ్చించి మూడేళ్ల డిగ్రీ కోర్సు చదివిసుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 28న ఉదయం 9 గంటలకు స్థానిక ఎస్‌కేఎన్ఆర్ జూనియర్ కళాశాల(బాయ్స్)లో హాజరు కావాలని కోరారు. వివరాలకు 91820 63878 మొబైల్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు బోధనోపకరణాల ఎంపిక



ప్రశంసపత్రం, జ్ఞాపిక అందిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): డబ్బా, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు రూపొందించిన బోధనోపకరణాలు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు శుక్రవారం తెలిపారు. తొలిమెట్టులో భాగంగా డబ్బా పాఠశాల ఉపాధ్యాయుడు మనోజ్ పరిసరాల విజ్ఞానంపై 'హాబిటేషన్స్ ఆఫ్ డిఫరెంట్ ఆనిమల్స్', స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సాయిశిల్ప ఇంగ్లిష్ సబ్జెక్టులో 'క్లాప్ ఆఫ్ టీఎల్ఎం' బోధనోపకరణాలు రూపొందించారని, ఈనెల 20న జగిత్యాలలో జరిగిన మేళాలో ఉత్తమ బోధనోపకరణాలుగా ఎంపికై రాష్ట్రస్థాయికి అర్హత సాధించాయని వివరించారు. దీంతో స్థానిక ఎమ్మార్సీలో మనోజ్, సాయిశిల్పకు జ్ఞాపిక, ప్రశంసపత్రాలు అందజేశామని పేర్కొన్నారు. తొలిమెట్టు నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారని వివరించారు.

నేడు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

జగిత్యాలటౌన్: స్థానిక ఓల్డ్ హైస్కూల్‌లో శనివారం రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. జూనియర్ విభాగంలో టోర్నీ నిర్వహిస్తారన్నారు. ఇందులో పాల్గొనేందుకు బాలబాలికల జట్లను ఈసందర్భంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. 2005 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించిన బాలబాలికలు అర్హులని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్, తల్లిదండ్రుల ఆధార్, పుట్టినతేదీ సర్టిఫికెట్‌తో నేరుగా హాజరు కావాలని ఆయన సూచించారు.

అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లాలో రెండు ఎస్‌వోలు, ఒక సీఆర్టీ, 11 పీజీ సీఆర్టీ, 4 పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అర్హులైన మహిళా అభ్యర్థులు మాత్రమే ఈనెల 26 నుంచి జూలై 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అదేనెలలో రాతపరీక్ష ఉంటుంది. ఆసక్తిగలవారు పూర్తి వివరాలకు www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

పైసలు పక్కదారి!



సారంగాపూర్(జగిత్యాల): మహిళలు ఆర్థికంగా ఎదగడానికి గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ద్వారా మహిళా సంఘాలను ప్రోత్సహిస్తోంది. వారి ఆర్థిక అవసరాలు తీర్చడానికి వివిధ రూపాల్లో రుణ సాయం చేస్తోంది. ఈ సొమ్ము వెచ్చించి మహిళలు వ్యాపారాలు చేస్తున్నారు. చిన్న, కుటీర పరిశ్రమలు స్థాపించి ఆర్థికంగా ఎదుగుతున్నారు. మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇందులో 90శాతం మంది సకాలంలో రుణవాయిదాలు చెల్లిస్తూ వస్తున్నారు. కానీ, కొందరు రుణవాయిదాలు చెల్లించడం లేదని, ఇలాంటి వారి తీరుతో సకాలంలో చెల్లించిన మహిళలపై పరోక్షంగా ప్రభావం పడుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్నిచోట్ల మహిళలు చెల్లించిన సొమ్మును వీవోఏలు, సీసీలు తమ సొంతానికి వినియోగించడంతో ఈ పరిస్థితి నెలకొందని అధికారులు వివరిస్తున్నారు.

- రుణవాయిదాలు చెల్లిస్తున్న మహిళలు
- సొంతానికి వాడుకుంటున్న వీఏవోలు, సీసీలు
- మిగతా సభ్యులపై ప్రభావం.. రంగంలోకి అధికారులు
- రికవరీకి నోటీసులు.. ఖాతరు చేయని వీఏవోలు, సీసీలు
- జిల్లా మహిళా సంఘాల్లో గందరగోళం



సమావేశమైన మహిళా సంఘాల సభ్యులు(ఫైల్)

పర్యవేక్షణ లోపం..

- ఒక్కో గ్రామైక్య సంఘంలో 12– 15 మంది మహిళలను కలిపి ఒక స్వశక్తి సంఘంగా ఏర్పాటు చేశారు.
- వీటి కార్యకలాపాలను వీవోలు ప్రతినెలా పర్యవేక్షిస్తారు.
- రుణవాయిదాలను ప్రతినెలా రెండు విడతల్లో అందుబాటులోని బ్యాంకుల్లో చెల్లించేలా చూస్తారు.
- ఇందుకోసం ప్రతీ స్వశక్తి సంఘం నుంచి ఇద్దరిని గ్రూపు లీడర్లుగా ఎన్నుకుని సభ్యులు ఇచ్చిన డబ్బును బ్యాంకుల్లో జమచేస్తారు.
- స్వశక్తి సంఘంలో తీర్మానం చేసిన కాపీని వీవో ద్వారా బ్యాంకులో అప్పగిస్తే మహిళలకు బ్యాంకు రుణం మంజూరు చేస్తుంది.
- నిర్దేశిత గడువులోగా రుణవాయిదా సొమ్మును మళ్లీ బ్యాంకులో జమచేయాలి.
- సంఘంలోని ఒకరిద్దరు ఈ సొమ్ము జమచేయకున్నా.. ఇది అందరికీ భారమవుతోంది.
- బ్యాంక్ లింకేజీ ద్వారా తీసుకున్న సొమ్ము ప్రతినెలా 5వ తేదీలోగా నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమచేయాలి.
- స్త్రీనిధి ద్వారా తీసుకున్న సొమ్మును ప్రతినెలా 15, 16వ తేదీల్లో గ్రామైక్య సంఘం పర్యవేక్షిస్తున్న వీవోఏలు ఈ సొమ్ము చెల్లిస్తే.. వీవోఏలు నేరుగా బ్యాంక్ ద్వారా హైదరాబాద్‌లోని స్త్రీనిధి కో ఆపరేటివ్ బ్యాంక్‌కు ట్రాన్స్‌ఫర్ చేస్తారు.
- రుణం తీసుకున్న సభ్యులు ఫోన్‌పే ద్వారా కూడా నేరుగా స్త్రీనిధి ఖాతాకు బదిలీ చేసే వెసులుబాటు కూడా ఉంది.
- కానీ, స్త్రీనిధి నుంచి రుణం పొందిన మహిళలకు అవగాహన లేక గ్రామైక్య సంఘం వీవోఏకు అప్పగిస్తున్నారు.
- ఇక్కడే సొమ్ము పక్కదారిపడుతోంది. ఫలితంగా సభ్యులు డబ్బులు చెల్లించినా వీవోఏలు, సీసీలు తమ సొంతానికి వాడుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలో పక్కదారి పట్టిన సొమ్ము ఇలా..

- బీర్‌పూర్ గ్రామైక్య సంఘంలో రూ.11 లక్షల దుర్వినియోగమైనట్లు ఇటీవల చేపట్టిన ఆడిట్ అధికారుల విచారణలో తేలింది. ఈ గ్రామైక్య సంఘంలో 30 స్వశక్తి సంఘాలు ఉన్నాయి. 2015–16 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి ద్వారా మంజూరైన రుణం కోసం 450 మంది సభ్యులు తీర్మానించారు. ఇందులో కొందరు తమకు రుణం వద్దని పక్కకు తప్పుకున్నారు. వీరి వాటా సొమ్ము వీవోఏ(సీఏ)ల పరిధిలోకి వెళ్లింది. దీనిని తిరిగి స్త్రీనిధికి పంపించాల్సి ఉండగా, వీవోఏలు తమ సొంతానికి వాడుకున్నారు. అందులో కొంత చెల్లించినా మిగతా సొమ్ము చెల్లించలేదు. ఈ విషయం జిల్లా అధికారుల దృష్టికి వెళ్లింది. విచారణ జరిపిన అధికారులు.. రూ.11 లక్షలు పక్కదారి పట్టాయని, వాటిని తిరిగి చెల్లించాలని వీవోఏలకు నోటీసులు జారీచేశారు. అయినా, ఆ సొమ్ము చెల్లించకపోవడంతో వారిని విధుల్లోంచి తొలగించారు.
- బీర్‌పూర్ మండలం కండ్లపల్లిలోని 25 సంఘాల మహిళలు రూ.50 వేల చొప్పున రుణం తీసుకున్నారు. ఇందులో కొందరు డిసెంబర్ 2022 నాటికి సకాలంలో రుణ వాయిదాల చెల్లింపులు పూర్తిచేశారు. మరికొందరు ఆన్‌లైన్‌లో బదిలీ చేశారు. ఇలా చెల్లించిన వారు బకాయిపడినట్లు ఆన్‌లైన్‌లో చూపించడంతో ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. మరికొందరు అసలు రుణవాయిదాలు చెల్లించనేలేదు. ఇక్కడ రూ.లక్ష వరకు బకాయి ఉన్నట్లు అధికారులు తెలిపారు.
- రెండేళ్లక్రితం సారంగాపూర్ మండలం కోనాపూర్‌లోని మహిళలు రుణ వాయిదాలు సక్రమంగా చెల్లించారు. కొందరు చెల్లించలేదు. ఉన్నతాధికారులు సుదీర్ఘ విచారణ జరిపి దాదాపు రూ.10 లక్షల వరకు బకాయిలు ఉన్నట్లు గుర్తించారు. ఆ సొమ్ము దుర్వినియోగమైనట్లు తేల్చారు. అయితే, బకాయిలు చెల్లిస్తామంటూ వీవోఏలతో అంగీకారపత్రం రాయించారు.
- సారంగాపూర్ మండలం రేచపల్లిలోనూ ఇలాంటి ఘటనే జరిగింది. ప్రత్యేక బృందాన్ని నియమించిన ఉన్నతాధికారులు.. మొత్తం సొమ్ము రికవరీ చేశారు.

సొమ్ము రికవరీ చేస్తాం



మహిళా సంఘాల్లో దుర్వినియోగమైన సొమ్మును కచ్చితంగా రికవరీ చేస్తాం. రుణ వాయిదాల సొమ్ము దుర్వినియోగం కాకుండా త్వరలోనే జిల్లా స్థాయిలో వీవోఏలతో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తాం. ఇదే సమయంలో వీవోఏ పరిధిలోని బ్యాంకు ఖాతాలపై సమీక్షిస్తాం.

– లక్ష్మీనారాయణ, డీఆర్డీవో

మహిళా సంఘాల సమాచారం	
గ్రామైక్య సంఘాలు	565
స్వశక్తి సంఘాలు	14,947
సభ్యుల సంఖ్య	1,73,695
2023–24లో బ్యాంకు లింకేజీ (రూ.కోట్లలో)	680
2023–24లో స్త్రీనిధి రుణం (రూ.కోట్లలో)	113

జగిత్యాలలో చిరుజల్లులు



పట్టణంలో కురుస్తున్న చిరుజల్లులు

జగిత్యాల: కొద్దిరోజులపాటు విపరీతమైన ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అయితే, శుక్రవారం సాయంత్రం చిరుజల్లులు కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

యువతను ప్రోత్సహిస్తాం



రన్ ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ మకరంద్

జగిత్యాలటౌన్: యువతను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించడం కోసమే ఒలింపిక్ డే రన్ ముఖ్య ఉద్దేశమని అదనపు కలెక్టర్ మకరంద్ అన్నారు. యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో ఒలింపిక్ డే రన్ – 2023 నిర్వహించారు. స్థానిక వివేకానంద మినీస్టేడియంలో జ్యోతి వెలిగించి రన్ ప్రారంభించాయక మకరంద్ మాట్లాడారు. జిల్లా యువజన, క్రీడల అధికారి నరేశ్, మున్సిపల్ డీఈ రాజేశ్వర్, వ్యాయామ ఉపాధ్యాయులు పడాల విశ్వప్రసాద్, కృష్ణప్రసాద్, హరిరాం, అజయ్‌బాబు, సుధాకర్, మంగ, శ్రీరాం, హరీశ్, క్రీడా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బుల్లో కోత



నిర్వాహకురాలిని నిలదీస్తున్న రైతులు

జగిత్యాలరూరల్: చల్‌గల్‌లో ధాన్యం విక్రయించిన రైతులు శుక్రవారం నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతులకు ధాన్యం డబ్బులు తక్కువ వచ్చాయన్నారు. అయితే, ఒక్కో రైతుకు మూడు కిలోల చొప్పున రైస్‌మిల్లర్ కట్ చేశారని, దాంతోనే బ్యాంకు ఖాతాల్లో తక్కువ సొమ్ము జమైందని నిర్వాహకురాలు వివరణ ఇచ్చారు. తమకు తెలియకుండా తాము విక్రయించిన ధాన్యంలో ఎలా కోత పెడతారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

పేదలు, ధనికులకు ఒకేన్యాయం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ

జగిత్యాలజోన్: న్యాయం అందించడంలో పేద, ధనిక అనే తేడా ఉండకూడదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ సూచించారు. జిల్లా కేంద్రంలోని కోర్టులో ఏర్పాటుచేసిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ చైర్మన్, హైకోర్టు జడ్జి పి.నవీన్‌రావు, జగిత్యాల జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జి, హైకోర్టు జడ్జి జి.అనుపమ చక్రవర్తి వర్చువల్ విధానంలో శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జిల్లా కోర్టులో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కార్యాలయాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. జిల్లా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ సభ్యుడిగా కటుకం చంద్రమోహన్, డిప్యూటీ చీఫ్‌గా పోట్టవత్తిని సతీశ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా రాచకొండ విజయ కృష్ణను తమ స్థానాల్లో కూర్చోబెట్టారు. అనంతరం జడ్జి నీలిమ మాట్లాడుతూ, చట్టానికి అందరూ సమానులేనన్నారు. స్థోమతలేని వారికోసం రాష్ట్ర లీగల్ సర్వీసెస్ సంస్థ న్యాయవాదిని నియమిస్తుందని తెలిపారు. గతంలో ఉచితంగా వాదించమంటే న్యాయవాదులు శ్రద్ధ చూపేవారు కాదన్నారు. ప్రస్తుతం డిఫెన్స్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులకు గౌరవ వేతనం చెల్లిస్తున్నామని చెప్పారు. ఇకనుంచి న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేనివారు నేరుగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులను సంప్రదించాలని సూచించారు. జిల్లా మొదటి అదనపు జడ్జి నారాయణ, సబ్ జడ్జి ప్రసాద్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీవిజ, మొదటి, రెండో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్లు జితేందర్, వినిల్‌కుమార్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సిరిపురం మహేంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయం ప్రారంభిస్తున్న న్యాయమూర్తి నీలిమ

కాంగ్రెస్ టికెట్‌పై గెలిచినా బీఆర్ఎస్‌లోకే..

- నిజామాబాద్ ఎంపీ అర్వింద్
- కోరుట్లలో బీజేపీ కార్యకర్తలతో సమావేశం
- జిల్లా కేంద్రంలో బీజేవైఎం శ్రేణుల బైక్ ర్యాలీ

కోరుట్ల: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యేలు మళ్లీ బీఆర్ఎస్‌లో చేరటం ఖాయమని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. బీజేపీ మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పార్టీ సీనియర్ కార్యకర్తలతో పట్టణంలో ఆయన సమావేశమయ్యారు. 2014 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో 33 శాతం మంది, 2018లో జరిగిన ఎన్నికల్లో 66 శాతం మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌ను వదిలి బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. ఈసారి వందశాతం మంది కాంగెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరటం ఖాయమని జోస్యం చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. క్వింటాలు ధాన్యంలో 10 కిలోలు తరుగు తీసి రైతులకు నష్టం కలిగించారని ఆరోపించారు. కోరుట్ల నియోజక వర్గంలో కేంద్రప్రభుత్వం విడుదల చేసిన నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గ్రామీణ సడక్ యోజన ద్వారా రూ.11.50 కోట్లతో రహదారులు, రూ.34 కోట్లతో చెక్ డ్యాంలు నిర్మించామన్నారు. బీజేపీలో చేరేందుకు అనేకమంది ఇతర పార్టీల నేతలు సిద్ధంగా ఉన్నారని, వారిని కచ్చితంగా పార్టీలోకి ఆహ్వానిస్తామని తెలిపారు. కానీ టికెట్‌పై భరోసా పెట్టుకోవద్దని తెలిపారు. కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన పథకాల గురించి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. బీజేపి జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణరావు, రాష్ట్ర కార్యదర్శి గంగారెడ్డి, కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ కుమార్, మాజీ జెడ్పీటీసీ జేఎన్ సునీత, కౌన్సిలర్లు మాడవేణి నరేశ్, పెంటం గణేశ్, దాసరి సునీత, నాయకులు సాంబారి ప్రభాకర్, మోలుమూరి మురళి, పీసరి నర్సయ్య, తిరుమల వాసు, సుదవేణి మహేశ్ పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న ఎంపీ అర్వింద్

మోదీ పాలనలో ఆర్థిక పరిపుష్టి

జగిత్యాలటౌన్: ప్రధాని మోదీ పాలనలో దేశం ఆర్థిక పరిపుష్టి సాధించి, ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా జిల్లా కేంద్రంలో ఆయన పర్యటించారు. సమాజాన్ని ప్రభావితం చేసే ప్రముఖులను కలిసి మోదీ తొమ్మిదేళ్ల పాలన, సాధించిన విజయాలపై ముద్రించిన పుస్తకాలను ప్రజలకు అర్వింద్ అందజేశారు. పాకిస్తాన్, చైనా లాంటి పొరుగు దేశాలకు దీటుగా సమాధానం చెప్పడమే కాకుండా తన దౌత్య నీతితో ప్రపంచదేశాలతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుతున్న ఘనత మోదీకే దక్కుతుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, పట్టణ అధ్యక్షుడు వీరబత్తిని అనిల్‌కుమార్, నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, శైలేందర్‌రెడ్డి, పడాల తిరుపతి, రాజేందర్, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బీజేవైఎం ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణ శివారు భాగ్యరాజ్ ఫంక్షన్‌హాల్ వద్ద ప్రారంభమైన బైక్ ర్యాలీ.. పాతబస్టాండ్, కొత్త బస్టాండ్, టవర్ సర్కిల్ మీదుగా డిగ్రీ కళాశాల వరకు సాగింది.

పోస్టు ఖాళీ.. అందని సేవలు

- రేడియాలజీ హబ్‌లో దుస్థితి

జగిత్యాల: జిల్లా కేంద్రంలో ఇటీవల తెలంగాణ డయాగ్నోస్టిక్, రేడియాలజీ హబ్ సెంటర్ ప్రారంభించారు. ఇందుకోసం దాదాపు రూ.3 కోట్లు వ్యయం చేశారు. అయితే, రేడియాలజీ హబ్‌లో రేడియాలజిస్ట్ పోస్టు నేటికీ భర్తీచేయలేదు. ఫలితంగా పేద పేషెంట్లకు సేవలు అందడం లేదు.

అందించే సేవలు ఇవీ..

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఇటీవల రేడియాలజీ హబ్ ప్రారంభించారు.
- అల్ట్రాసౌండ్ స్కానింగ్, మెమోగ్రామ్, 2డీ ఇకో, ఎక్స్‌రే, సీటీస్కాన్ తదితర సేవలు దీని ద్వారా అందుబాటులోకి వస్తాయి.
- ఈ యంత్రం నిర్వహణకు ఓ ఉద్యోగిని నియమించకపోవడతో అది నిరుపయోగంగా మారింది.
- ఇందులో ఒక రేడియాలజిస్ట్, ఇద్దరు రేడియోగ్రాఫర్లు సేవలు అందించాల్సి ఉంది.
- ఇందులో ఒకరు మేల్, ఒక ఫీమేల్ ఉంటారు.
- ఇక్కడకు వచ్చే పేషెంట్లకు అన్ని పరీక్షలు ఉచితంగానే అందిస్తారు.
- ఒకవేళ ప్రైవేటు ఆస్పత్రుల్లోకి వెళ్లే పేషెంట్లు.. అక్కడ రాసే టెస్ట్‌లను ఈ రేడియాలజీ హబ్‌లోనూ చేయించే వీలుంది.
- ప్రైవేట్‌లో అయితే, సుమారు రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు బిల్లు వేస్తున్నారు. ఇక్కడ ఆ సేవలను ఉచితంగా అందిస్తారు.



రేడియాలజీ హబ్

డయాగ్నొస్టిక్ సెంటర్‌లో 57 రకాల టెస్టులు..

జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను కూడా ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో 57 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఉచితంగా అందిస్తున్నారు. సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్తే.. అక్కడ బ్లడ్ శాంపిల్స్ తీసుకుని తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌కు పంపిస్తున్నారు. ఇందులో యూరిన్ తదితర పరీక్షలు చేసి సాయంత్రం వరకు రిపోర్ట్ ఇస్తున్నారు. ఈసీజీ, 2డీ ఇకో, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే సౌకర్యం కూడా డయాగ్నొక్ సెంటర్‌నే అందుబాటులో ఉంది. కానీ, సేవలే అందడంలేదు.

ఏర్పాటు చేసినట్లే చేసి..

రేడియాలజీ హబ్‌ను ప్రారంభించిన వెంటనే రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఒక రేడియాలజిస్ట్ పోస్టు మంజూరు చేశారు. ఓ సీనియర్ రెసిడెంట్ రేడియాలజిస్ట్‌ను నియమించినా.. ఉద్యోగంలో చేరలేదు. సదరు ఉద్యోగికి పోస్టింగ్ లెటర్ ఇచ్చినా, సర్టిఫికెట్లు పరిశీలించి చదువు పూర్తికాలేదని ప్రభుత్వ ఆస్పత్రిలోని కొందరు అడ్డుకున్నట్లు తెలిసింది. దీంతో ఆ పోస్టు ఖాళీగానే ఉంటోంది. మరోవైపు.. నోటిఫికేషన్ ద్వారా ఓ రేడియోగ్రాఫర్‌ను నియమించారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు

రేడియాలజీ హబ్‌కు రేడియాలజిస్ట్ పోస్టు మంజూరైంది. అయినా ఉద్యోగంలో నేటికీ జాయిన్ కాలేదు. త్వరలోనే ఆ పోస్టు భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న రేడియాలజిస్ట్‌ల సేవలు వినియోగిస్తున్నాం. పేషెంట్లు ఇక్కడకు వస్తే అక్కడకు తీసుకు వెళ్లి పరీక్షలు చేయిస్తున్నాం. పేషెంట్లకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

– రాములు, ఆస్పత్రి సూపరింటెండెంట్

సివిల్ సర్వీసెస్‌లో ఉచిత శిక్షణ

జగిత్యాల: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి 100 మంది మైనార్టీ విద్యార్థులకు సివిల్ సర్వీసెస్‌లో పోటీపడేందుకు ఉచిత శిక్షణ ఇస్తామని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి సాయిబాబా శుక్రవారం తెలిపారు. ఇందులో మహిళలకు 33శాతం, వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. అర్హుల నుంచి ఈనెల 26 నుంచి జూలై 13వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. అదేనెల 23న స్ట్రీమింగ్ టెస్ట్ నిర్వహిస్తామని వివరించారు. జిల్లాకు చెందిన మైనార్టీ అభ్యర్థులు www.cet.egg.gov.in.tmreis వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 040–23236112 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.